విశాలాంధ్ర అనకాపల్లి
పేజి నెం. 6
మంగళవారం 16, జూలై, 2024

భారతీయ న్యాయ సహితపై అవగాహన

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామంలో అంగన్వాడి కేంద్రాల వద్ద సోమవారం మిషన్ శక్తి భారతీయ న్యాయ సహిత 2023 కార్యక్రమంపై మహిళలకు, బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చట్టాలు, శిక్షలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వీటితో పాటుగా బేటీ బచావో... భేటీ పడావో.. ఆడపిల్లలను కాపాడండి ఆడపిల్లలను రక్షించండని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు ఏటుకూరు రాజేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ జయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ఈశ్వరమ్మ, మంగ, వేణు, సత్య, జగది, పరదేశమ్మ, సుబ్బలక్ష్మి, వెంకటలక్ష్మి, పాచినవానిపాలెం అంగన్వాడీ కార్యకర్త అప్పలనస పాల్గొన్నారు.

రాజుపాలెం రెవెన్యూలో గెడ్డ స్థలాలు కబ్జా

- గెడ్డలను కప్పేసి రోడ్డు నిర్మాణం
- పేట్రేగిపోతున్న గ్రామస్థాయి దళారులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: బాగా కరువులో ఉన్నట్లు ఉన్నారు.. కనిపించిందల్లా కబ్జా చేసుకుపోతున్నారు.. స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో గ్రామస్థాయి దళారులు ప్రభుత్వ వాగులను, వంకలను, గెడ్డలను కబ్జా చేస్తూ అమ్మకాలు కూడా సాగిస్తున్నారు. దళారుల కబ్జాల పర్వంపై గ్రామస్థాయిలోనే అనేక విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో రాజుపాలెం రెవెన్యూ పరిధిలో కొత్తూరు నర్సింగరావుపేట గ్రామంలో సర్వేనెంబర్ 72లో సుమారు 24 సెంట్లు గెడ్డ ఉంది. అయితే గెడ్డ సమీప స్థలాలకు దారి లేదు. దీనిని అదునుగా తీసుకున్న దళారులు ఆ స్థలాల యాజమాన్యంతో మాట్లాడి గెడ్డను కప్పేసి దానిద్వారా నిర్మించి ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనుకున్నదే తడువుగా గెడ్డను కప్పేసి రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇంత తతంగం జరుగుతున్నా గెడ్డ ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం విడ్డూరం. గ్రామస్తులు మాత్రం ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతుందని, ఉదయం లేస్తే దళారులు, రెవెన్యూ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది కలిసే తిరుగుతారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో చాలావరకు ప్రభుత్వ కాలువలు, గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయి. దీనివలన గ్రామంలో విపరీతమైన మంచినీటి సమస్య ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఈ గెడ్డను కూడా ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపడితే మంచినీటి సమస్య తీవ్రస్థాయిలో ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులు క్రితం కూడా సర్వేనెంబర్ 67/1లో సుమారు 54 సెంట్లు గెడ్డను కొంతమంది రియల్ మాఫియా మట్టితో కప్పేసి రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పుడు కూడా రెవెన్యూ అధికారులు స్పందించలేదు. ప్రజలే స్పందించి ఫిర్యాదు చేయడంతో తప్పక ఆ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారు. కానీ గెడ్డ లో ఉన్న మట్టిని మాత్రం తొలగించకుండా రోడ్డును అలాగే వదిలేశారు. రియల్ మాఫియా, రెవెన్యూ సిబ్బంది లోపాయికారి ఒప్పందం మేరకే తాత్కాలిక చర్యలు తీసుకున్నారనే ఆరోపణ సైతం వినిపిస్తున్నాయి. ఆరోపణలను నిజం చేస్తారా... కబ్జాదారులపై చర్యలు తీసుకుంటారా..? అనే విషయాలపై రెవెన్యూ అధికారులే నోరు విప్పాలి.

భూములకు నష్ట పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలం దోనివానిలక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వం వారు వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో సర్వే నెంబర్ 85లో 110 ఎకరాలు 150 పేదలు సాగు చేసుకుంటున్న భూములను సేకరిస్తున్నారని, ఈ భూములు సాగుచేసు కుంటున్న పేదలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకట రమణ మాట్లాడుతూ పేదలకు ఈ భూములు తప్ప వేరొక ఆధారం లేదని 2013 భూ సేకరణ చట్టాన్ని పరిగణ నలోకి తీసుకుని పేద సాగుదారులకు జిరాయితీతో సమానంగా నష్టపరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేపలు పరదేశి, వాసపల్లి బాబ్జీ, కిల్లాడి వరహాలు, ఏడిద చిలకమ్మ, గింజాల సింహాద్రి, సిరిపల్లి జగమణి, చేపల రాజు, గరిగిన అమ్మాజీ తదితరు పాల్గన్నారు.

సామాజిక తనిఖీపై విచారణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో నిర్వహించిన సామాజిక తనిఖీపై అధికారులు మరోసారి విచారణ నిర్వహించారు. గ్రామం లో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వ తేదీ వరకు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీ బృందాలు విచారణ నిర్వహించాయి. ఇందులో రూ.37,532 ఫీల్డ్ అసిస్టెంట్ తేడాలు చేసినట్లు తనిఖీ బృందాలు ప్రజా వేదికలో నిర్ధారించాయి. అయితే ఇదే గ్రామంలో గతంలో ఎక్కువ మొత్తంలో తేడాలు జరిగినట్లు గుర్తించారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఈటీవీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ గ్రామంలో మరోసారి విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్, ఏపీవో హేమలత, పంచాయతీ కార్యదర్శులు వై.సత్యనారాయణ, బి.ఏ.బి.ఎల్. మూర్తి, టిడిపి నాయకులు చించనపు ప్రదీప్, చించలపు సన్యాసమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో జరిగిన ఉపాధి పనులు సామాజికపై గ్రామస్తులు కొందరు ఫిర్యాదు చేయడంతో మరోసారి అధికారులు విచారణ నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి వై. సత్యనారాయణ గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామంలో సుమారు రూ. 37,112 తేడాలు ఉన్నట్టుగా సామాజిక తనిఖీ బృందం గుర్తించారు. అయితే తేడాలు ఎక్కువగా ఉన్నాయని, మరలా విచారణ నిర్వహించాలని ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ నిర్వహించారు. ఇప్పటికే ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారని ఈదటం, నామవరం గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ లపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

కౌలు రైతులను గుర్తించండి

కలెక్టర్‌కు రైతు స్వరాజ్య వేదిక వినతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో గుర్తింపు లేకుండా ఉన్న కౌలు రైతులను గుర్తించాలని జిల్లా కలెక్టర్‌కు రైతు స్వరాజ్య వేదిక వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర కో కన్వీనర్ గాడి బాలు మాట్లాడుతూ జిల్లా పూర్తిస్థాయి గ్రామీణ జిల్లా అని, ముఖ్యంగా వ్యవసాయం మీద కేంద్రీకృతమై ఆర్థిక విధానాలు అమలవుతున్న జిల్లా అని ఈ జిల్లాలో కౌలు రైతులు గుర్తింపు కొరకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై గుర్తిస్తే వ్యవసాయంలో కష్టనష్టాలను తట్టుకొని సాగు చేస్తున్న కౌలు రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో గతంలో 4000 మంది వరకే సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చారని, ఈ ఏడాది 5000 కార్డులు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం వలన వాస్తవ సాగుదారులకు అన్యాయం చేయడమే అవుతుంది అన్నారు. నిజానికి జిల్లాలో 35 వేల కంటే ఎక్కువగా కౌలు రైతులు ఉన్నారని రైతు స్వరాజ్య వేదిక స్టడీ తెలిపిందని కాబట్టి న్యాయం జరిగే విధంగా గ్రామీణ స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది కలిసి గ్రామ సభలు నిర్వహించి ఎక్కడెక్కడ ఎవరెవరు సాగు చేస్తున్నారో నిర్ధారణ చేసుకొని భూ యజమానిని ఒప్పించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి తగిన సూచనలు ఇస్తూ కౌలు రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అవసరం ఉన్నంతమేర కౌలు రైతులందరికీ న్యాయం జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రైనేజీల పరిశుభ్రత చర్యలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో డ్రైనేజీలను క్లీన్ చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను స్ప్రే చేశారు. ఈ నెల 15వ తేదీన పూడిమడకను పీడిస్తున్న డ్రైనేజీ సమస్య అనే వార్త విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు సోమవారం డ్రైనేజీలను క్లీన్ చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను స్ప్రే చేశారు. డ్రైనేజీ పనులను వారం రోజులలో ప్రారంభించి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజుకు సత్కారం

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజును అన్నవరం వెంకయ్య గారి పేట విశాఖ డెయిరీ పాల సంఘానికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సోమవారం ఘనంగా సత్కరించింది. నూతనంగా ఎన్నికైన పాలు సంఘం అధ్యక్షుడు గొన్నబత్తుల కొండబాబు, డైరెక్టర్లుగా ఎన్నికైన పొట్నూరు నారాయణరావు, గూటాల సత్తిబాబును అభినందించడం జరిగింది. ప్రస్తుతం కొనసాగుతున్న డైరెక్టర్లు గొన్న బత్తుల రమణ, నేమాల అర్జునమ్మ, పొట్నూరు పెదరాము, గుమ్మాల ఆనందరావు, సీతిని తాతబాబులకు సలహాలు సూచనలు ఇచ్చి అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా కెఎస్ఎన్ఎస్ రాజు చేతులు మీదగా పాలు మెంబర్లకి ప్రెసిడెంట్ గొన్నబత్తుల కొండబాబు సొంత నిధులతో వ్యవసాయానికి ఉపయోగపడే పెద్ద గిన్నెలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నవరం మాజీ వార్డ్ మెంబర్ ఎర్రంశెట్టి అప్పారావు (అన్నవరం చిన్న), సంఘం సభ్యులు, పాడి రైతులు, టిడిపి సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకర బాబ్జి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కోటవురట్ల: టీడీపీ యువ నాయకులు, అనకాపల్లి జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి సుంకర బాబ్జి జన్మదిన వేడుకలు గొట్టివాడ గ్రామంలో తెలుగు తమ్ముళ్లు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు జానకి శ్రీనివాస్‌రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, కొడవటిపూడి ఎంపీటీసీ సూర్య ప్రకాష్, కోటవురట్ల ఎంపీటీసీ పివి సూర్యారావు, బాబ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గొట్టివాడ గ్రామంలో గ్రామ తెదేపా నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బొకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోటవురట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకర కుమార్, రాజు పలువురు తెదేపా యువకులు పాల్గొన్నారు.

భూములు టాంపరింగ్ చేసిన వారిపై చర్య తీసుకోవాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: తనకు చెందిన భూమిని టాంపరింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన అల్లు పెద్ద కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. శ్రీరాంపురం రెవెన్యూ, వెంకటనగరం పంచాయతీ సర్వే నంబర్ 318/10లో 1.01 ఎకరా భూమిని 1999లో ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. తనకు చెందిన భూమిని 2016లో ఆన్‌లైన్‌లో ట్యాంపరింగ్ చేశారని తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినట్టు తెలిపారు. తన భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆన్‌లైన్‌లో 1 బి అడంగల్ వచ్చేటట్లు చూడాలని, ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అల్లు పెద్ద కృష్ణ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కశింకోట: టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పుట్టినరోజు వేడుకలు కశింకోట ప్రేమ సమాజం వద్ద మండల టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రేమ సమాజంలో ఉన్నవారికి నెల రోజులు సరిపడే విధంగా కిరాణా, దుప్పట్లు, పిల్లలకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. మండల నాయకులు మాట్లాడుతూ రత్నాకర్ సార్వత్రిక ఎన్నికల్లో ఎంతో కష్టపడి పని చేసి కూటమి విజయంలో పాలు పంచుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కాయల మురళీధర్, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి దొరబాబు, పెదపాటి కళ్యాణి, నిమదాల సన్యాసి నాయుడు, పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, కుక్కల రమణ, అందె రమణ, దాడి నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక దందాపై విచారణ చేయాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మండలంలో జరిగిన ఇసుక దందాపై వెంటనే విచారణ చేపట్టాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నర్సీపట్నం మండలం, గబ్బాడలో ఏర్పాటు చేసిన ఇసుక డిపోను పరిశీలించారు. అనంతరం మైన్స్ ఎండీ ప్రవీణ్ కుమార్‌తో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేల టన్నుల ఇసుకను ఈ డిపోలో డంప్ చేయడం జరిగిందన్నారు. దీనిపై రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు తెలియదని చేతులు దులిపేసు కుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డిపోలో 63 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్టు అంచనా ఉందని, దీనిపై సమావేశం నిర్వహించేందుకు ఆర్డీవో నిర్ణయం తీసుకున్నారన్నారు. అనకాపల్లి జిల్లాకు ఇసుక తరలించేందుకు రాజమండ్రిలో ప్రత్యేక రీచ్ కావాలని అడిగామని, దానిపై రెండు జిల్లాల కలెక్టర్లు మాట్లాడారని, మీరు కూడా అనుమతి ఇవ్వాలని స్పీకర్ అయ్యన్న అన్నారు. ఆగష్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న అన్నా క్యాంటీన్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నంలో నాలుగు రోజులు ముందుగానే ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తమ సొంత అవసరాల మీద పట్టణ ప్రాంతాలకు వచ్చే పేదలకు తక్కువ ధరకు భోజనం అందించడమే అన్నా క్యాంటీన్ల ఉద్దేశ్యమన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం పూర్తి చేయడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ అధికారులు ఈఈ వి.ఎస్.నగేష్ బాబు, డిఈ ఈశ్వరరావు, ఏఈ నర్సింగరావులు పాల్గొని ఇప్పటివరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగతా 40 శాతం పనులను త్వరగా పూర్తి చేయడానికి వర్క్ ఎస్టిమేషన్ అందజేశారు. పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయడానికి చర్యలు వేగవంతం చేయాలని అయ్యన్న అన్నారు.

రక్షిత మంచినీటి పథకంలో బ్యాక్టీరియా

విశాలాంధ్ర - రావికమతం: మండల కేంద్రం బీసీ కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి పథకంలో బ్యాక్టీరియా ఉందని నిర్ధారణ అయిందని ఈవో పిఆర్డి విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో గత వారంలో పలువురు అతిసార వ్యాధికి గురైన విషయం తెలిసిందే అన్నారు. ఏ కారణంచే ఈ వ్యాధి వ్యాప్తి చెందిందని కనుగొనే ందుకు మండల కేంద్రంలో వివిధ త్రాగునీటి వనరు లలో నీటి శాంపిళ్ళను ఈనెల 10న ప్రయోగశాలకు పంపామన్నారు. వీటిని పరిశీలించిన ల్యాబ్ బీసీ కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి పథకంలో ఇంకోలై బ్యాక్టీరియా ఉందని ధృవీకరణ అయింద న్నారు. ఈ మేరకు ట్యాంక్‌ను బ్లీచింగ్‌తో వరుసగా పది రోజులు శుభ్రం చేసిన తర్వాతే త్రాగునీటి సరఫరా పునరుద్ధించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే కంచిపాటి వారి వీధిలో జి.చిలకమ్మ, ఎస్సీ కాలనీలో ఐ.నూకాలమ్మ, బీసీ కాలనీలో జి.పైడితలమ్మ సొంత ఇంటి చేతి పంపులో కూడా కొద్దిపాటి బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నీటిని వాడకూడదని సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

మీ సేవా కేంద్రాలకు పూర్వ వైభవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: కూటమి ప్రభుత్వం మీ సేవా కేంద్రాలకు పూర్వ వైభవం రానుందని మండల మీ సేవా యూనియన్ గౌరవ అధ్యక్షులు ముత్తా గోవిందరావు అన్నారు. గోకులపాడు వద్ద సోమవారం సాయంత్రం మండల యూనియన్ సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో గత అయిదేళ్ళు మీ సేవా నిర్వాహకులు రోడ్డున పడ్డారని తెలిపారు. త్వరలో మీ సేవకు మంచి రోజులు రానున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కర్రి జోగరావు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఏఎన్ బాబు, భీమరశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కర్రి భూపతిరావు, సహాయ కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు.

మృతుని కుటుంబానికి రూ.2.50 లక్షలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన భవన నిర్మాణ కార్మికుడు రొంగల శివ కుటుంబానికి రూ.2.50 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్టు తుని, పాయకరావుపేట తాపీ పనివారుల సంఘం అధ్యక్షులు మజ్జూరి నారాయణరావు తెలిపారు. మృతుడు తల్లికి లక్ష రూపాయలు, భార్యకి లక్షన్నర రూపాయలు అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు చిన్నారావు, కూండ్రపు చంటి, పంపనబోయిన చంటి, మేకలు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో వృద్ధుడు దారుణ హత్య

విశాలాంధ్ర - వి.మాడుగుల: చేతబడి చేస్తున్నాడన్న నెపంతో ఓ వృద్ధుడిని అతని బంధువే నరికి హత్య చేసిన ఘటన మాడుగుల మండలం కేజె.పురంలో చోటుచేసుకుంది. ఎస్సై దామోదర్ నాయుడు అందించిన వివరాల మేరకు సూరిశెట్టి సూర్యనారాయణ(68), నర్సింగరావు కేజె.పురంలో నివాసం ఉంటున్నారు. సూర్యనారాయణకు చేతబడి చేయడం తెలుసునని, తన పిల్లలకు ఆరోగ్యం బాగోపోవడం వెనుక అతడే ఉన్నాడని నర్సింగరావు అనుమానించాడు. ఆదివారం సాయంత్రం పొలంలో మాటు వేసి కత్తితో సూర్య నారాయణపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం కత్తితో మాడుగుల పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిందితుడు నర్సింగరావు లొంగిపోయాడు. మృతుడు సూర్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ.దామోదర్ నాయుడు తెలిపారు.

విశాలాంధ్ర
అనకాపల్లి
పేజి :2
మంగళవారం 16, జూలై, 2024

అందుబాటు ధరల్లో
బియ్యం, కందిపప్పు విక్రయం



విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: బియ్యం, కంది పప్పు ప్రజలకు అందుబాటు ధరల ద్వారా విక్రయములు జరిపేందుకు రాష్ట్ర వర్తక సంఘాలు అంగీకరించాయని అందువలన రైతు బజార్లు, ప్రజలకు అందుబాటులో గల ప్రదేశములు ఇంకా రిలయన్స్, మోర్, స్పెన్సర్లు, డి మార్టు వంటి బహుళ సముదాయముల వర్తక కేంద్రాలయందు ప్రత్యేక కేంద్రములు తెరిచి బియ్యము బీపీటీ / సోనామసూరి (స్టీమ్డ్) వెరైటీ కిలో 49 రూపాయలకు, బీపీటీ / సోనామసూరి (పచ్చి), వెరైటీ కిలో 48 రూపాయలకు, కందిపప్పు కిలో 160 రూపాయలకు అమ్మకం జరపాలని ప్రభుత్వం నిర్ణయము తీసుకుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలననుసరించి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అమ్మకాల కేంద్రాలు యందు బియ్యము, కందిపప్పుపై ధరల ప్రకారము అమ్మకాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క వినియోగదారుడు కందిపప్పు ఒక్క కెజి బియ్యము ఐదు కేజీలు కొనుగోలు చేయవచ్చు అన్నారు. ముందు ముందు ప్రజల అవసరాల కనుగుణముగా కేంద్రములు పెంచుతామని కూడా జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- అధికారులకు భరణికం గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర - పరవాడ: పెద మొల్లోడు గెడ్డను కలుషితం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భరణికం గ్రామస్తులు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం మాజీ సర్పంచ్ బొండా తాతారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పెదిశెట్టి వెంకట సత్యారావు తదితరులు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టరుకు, పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావుకు వినతి పత్రం అందజేశారు. పరవాడ భరణికం గ్రామాల మధ్యనున్న మొల్లోడు గెడ్డలో ఫార్మా కంపెనీ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ప్రమాదకర వ్యర్థ రసాయన జలాలు విడిచి పెడుతున్నాయని, దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలను శుద్ధిచేసి పైపు లైన్ ద్వారా సముద్రంలోకి పంపించవలసిన రాంకీ యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్లనే ఫార్మా యాజమాన్యాలు ఇలా

గెడ్డల్లోకి వ్యర్థ రసాయన జలాలను విడిచి పెడుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత కంపెనీ యాజమాన్యాల పైన, రాంకీ పైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఘనంగా రత్నాకర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కశింకోట: ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా కశింకోటలో ఉన్న బాలసదనం చిల్డ్రన్ హోమ్‌లో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఫ్రూట్స్, బుక్స్ వంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదపాటి కళ్యాణి, పిల్లల శంకర్, కొండ్రపు కృష్ణం నాయుడు, మాట్లాడుతూ తమ సంక్షేమ సంఘానికి అన్ని విధాలుగా సపోర్ట్ చేస్తున్న దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తు లో దాడి రత్నాకర్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు

పెదపాటి కళ్యాణి, ఉపాధ్యక్షులు కొండ్రపు కృష్ణం నాయుడు, కార్యదర్శి పిల్లల శంకర్, కొండ్రపు ఉమామహేశ్వరి, చెన్నాద జగప్పారావు, సిమ్మ శ్రీనివాస్, మాస్వరపు వెంకయ్య నాయుడు, కే సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో స్పందనకు 95 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 95 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ (డెవలప్ మెంట్) కె.ఎస్.విశ్వనాధన్‌తో కలిసి నిర్వహించారు. 1వ జోన్‌కు 01, 2వ జోన్‌కు 15, 3వ జోన్‌కు 26, 4వ జోన్‌కు 12, 5వ జోన్‌కు 12, 6వ జోనుకు 12, 8వ జోన్‌కు 10, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 07 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జీవీఎంసీ రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 04, పట్టణ ప్రణాళిక విభాగమునకు 58, ఇంజినీరింగు విభాగమునకు 16, ఉద్యాన వనం విభాగమునకు 03, యుసిడి విభాగానికి 04 కలిపి మొత్తంగా 95 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబం ధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్ణీత సమ యంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డా.వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు,

చీఫ్ సిటీ ప్లానరు బి.సురేష్ కుమార్, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, డిసి (రెవెన్యూ) శ్రీనివాసరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, డిడిహెచ్ ఎం.దామోదర రావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, ఎఫ్.ఎ ఎ.ఓ మల్లికాంబ, అందరు పర్యవేక్షక ఇంజినీర్లు, డీపీఓ చంద్రిక, సివిఒ డా.ఎస్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షల కోసం బ్రాహ్మణులకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - చోడవరం: ఏపీలో జరిగే 2024 మెగా డీఎస్సీలో అర్హత పరీక్ష టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కావూరు చరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ.పి. ప్రభుత్వం త్వరలో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని, దీనిలో అర్హత కోసం టెట్ మరియు డీఎస్సీ (సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు) నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి హాజరయ్యే అర్హులైన బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్టు చరణ్ కుమార్ తెలిపారు. అర్హులైన బ్రాహ్మణ అభ్యర్థుల నుంచి ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

శిక్షణకు వచ్చే అభ్యర్థులు తమ పదో తరగతి, టీటీసీ, లేదా బి.ఈడి, డిఈడి, ఆధార్, జెరాక్స్ ధృవ పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9962599790, 9246625822ను సంప్రదించవచ్చున్నారు.

రియల్ వ్యాపారుల బరితెగింపు

- మంత్రిపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా
- ప్రభుత్వ హెచ్చరిక బోర్డు సైతం తొలగింపు
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం మంత్రిపాలెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగిస్తున్నారు. కొంత జిరాయితీ స్థలాన్ని కొనడం పక్కనున్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి లే అవుట్లు వేయడం ఇక్కడ రియల్ వ్యాపారులకు దిన చర్యగా మారింది. ఈ కబ్జాలపై రెవెన్యూ అధికారుల హెచ్చరికలను ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏ మాత్రం లెక్క చేయడం లేదు. వివరాల్లోకి వెళ్తే మంత్రిపాలెం రెవెన్యూ సర్వే నెంబర్లు 130,131లోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పక్కనే ఉన్న సర్వేనెంబర్ 128 జిరాయితీలోని సుమారు 0.70 ఎకరాల్లో అక్రమ లే అవుట్ వేసారు. ఆ జిరాయితీ స్థలాన్ని ఆనుకుని పై రెండు సర్వే నెంబర్లకు చెందిన ప్రభుత్వ స్థలంలో కొంత స్థలాన్ని కబ్జా చేశారు. దీనికి తోడు ఆ అక్రమ లే అవుట్‌కు రహదారి మార్గం లేకపోవడంతో అదే ప్రభుత్వ స్థలంలో నుంచి దర్జాగా రోడ్డు వేసుకున్నారు. దీనిపై గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో పలుమార్లు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ హెచ్చరిక బోర్డును వెను వెంటనే ఆ రియల్ వ్యాపారులు తొలగిస్తూ వస్తున్నారు. అది ప్రభుత్వ భూమి అని తెలిస్తే అందులో ప్లాట్లు ఎవరూ కొనరని భావించి బోర్డును పీకేసి తమ రియల్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పైగా అది తెలియని చాలామంది అందులో ప్లాట్లు కొని మోసపోతున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదారుసార్లు హెచ్చరిక బోర్డును తొలగించి ఆ రియల్ వ్యాపారులు రెవెన్యూ అధికారులతో ఆటలాడు తున్నారు. అసలే అక్రమ లే అవుట్ పైగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్న ఆ రియల్ వ్యాపారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు రెవెన్యూ అధికారుల హెచ్చరికలను లెక్కచేయక.. ఇటు రహదారి మార్గం లేని అక్రమ లే అవుట్‌లో ప్లాట్లు విక్రయించి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న ఆ రియల్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు

విశాలాంధ్ర - చోడవరం: ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలందరి సహకారంతోనే చోడవరం అభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ బంది నూకాలమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సి.ఎం. చంద్రబాబు, డిప్యూటీ సి.ఎం. పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అవినీతి లేని పాలన అందివ్వడమే అధికార కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమం, పట్టణం అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పాలక వర్గం, అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలకు ఏడాదిన్నర సమయం వుందని, అధికారులు, పాలక వర్గం, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో పట్టణాభివృద్ధి పై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ, సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి, పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి రూపకల్పన చేయాలన్నారు. చోడవరం, చుట్టుపక్కల త్రాగునీరు,

డ్రైనేజీ, పరిసరాల పరిశుభ్రత వంటి మౌలిక వసతులు కల్పించడంలో దృష్టి సారించవల్సిందిగా సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, పంచాయతీ పాలక వర్గం, అధికారులు, సకురు కోటేశ్వర రావు, రొంగలి రమణ, జనసేన నాయకులు కర్రి రమేష్, తదితతులు పాల్గొన్నారు.

23 నుండి "పొలం పిలుస్తోంది"

విశాలాంధ్ర - చోడవరం: ఆధునిక, సేంద్రీయ సాగు పద్ధతులపై రైతాంగానికి అవగాహన కల్పించేందుకు ఈ నెల 23 నుండి "పొలం పిలుస్తోంది" ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ కమిషనర్ నుండి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు పొలం బాట పట్టనున్నారు. వారానికి 2 రోజుల పాటు, రోజుకు 2 గ్రామాలు చొప్పున ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం గ్రామాలు, మండలాలు వారీగా షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. ఉదయం పూట పొలాల్లో క్షేత్ర పర్యటన, మధ్యాహ్నం రైతాంగంతో సమావేశాలు జరపనున్నారు.

17న ఆషాఢ శుద్ధ ఏకాదశి సత్యవ్రతములు

విశాలాంధ్ర, - నర్సీపట్నం: పట్టణంలో ని ఉత్తరవాహిని దగ్గర వేంచేసియున్న శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వారి దేవస్థానములో ఈ నెల 17వ తేదీ బుధవారం ఆషాడశుద్ధ (తొలి) ఏకాదశి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామివారి వ్రతములు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు పెరివెల్లి భద్రాచల రామం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం 1వ బ్యాచ్ ఉదయం 6గంటలకు, తదుపరి 2వ బ్యాచ్ 9.30గంటలకు వ్రతములు జరిపించుకోవొచ్చు అన్నారు.. భక్తులు పూజసామాగ్రి తెచ్చుకోవలెనని, స్వామివారి ప్రతిమా, ప్రసాదం దేవాలయం వద్ద ఏర్పాటు చేశామన్నారు. కావున భక్తులు వ్రతములు జరిపించుకొని స్వామివార్లను దర్శించుకొని, తీర్థ ప్రసాదములను స్వీకరించి ఆయురారోగ్య ఐశ్వర్యములను పొందాలని సూచించారు. వివరములకు అర్చకుల సెల్ నెంబర్ 98481 67584 లో సంప్రదించాలన్నారు.

బుద్ధ అవతారంలో జగన్నాథుడు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో ఇంద్రజ్యుమ్నం వద్ద కొలువై ఉన్న జగన్నాథ స్వామి తొమ్మిదవ అవతారంగా బుద్ధవతారంలో సోమవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన పూజారులు పండా నూకరాజు, పండా శివసాయి జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

విద్యార్థిని సన్మానించిన ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గిడిజాల ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థి ఈ. అరవింద్ 570 మార్కులతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం శుభ పరిణామం అని టిడిపి సీనియర్ నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ అన్నారు. విద్యార్థి చదువుకు కావలసిన చదువుకు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానని భరోసా కల్పించారు అనంతరం విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో షి నగం రామకృష్ణ, కొణితుల శంకర్రావు, సన్యాసిరావు, గణేష్, షినగం గణేష్ పాల్గొన్నారు.